
ఆంధ్రజ్యోతి
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.4 కనిష్ఠం 25.1
కామారెడ్డి జిల్లా వార్తలు
3
గురువారం 20 జూన్ 2024





నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నీట్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జీతో
విచారణ జరిపించాలి

కామారెడ్డిటౌన్, జూన్ 19: నీట్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జీతో విచారణ జరిపించాలని, పేపర్ లీకేజీకి ప్రధాని మోదీ బాధ్యత వహించి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కామారెడ్డి విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. నీట్ లీకేజీని నిరసిస్తూ బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంబీబీఎస్, ఇతర వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్, యూజీ ఎంట్రన్స్‌లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారితల్లిదండ్రుల్లో నెలకొన్న అనుమానాలపై ప్రధాని స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. పేపర్‌లీకేజీకి బాధ్యత వహిస్తూ నీట్ చైర్మన్ ప్రదీప్‌కుమార్‌జోషి రాజీనామా చేయాలని, నీట్‌పరీక్షను రాష్ట్రాలపరిధిలోకి మార్చాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదుచేసి నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.




- ధరణి దరఖాస్తులను పరిష్కరించే దిశగా సర్కారు అడుగులు
- గత మూడు నెలల క్రితం దరఖాస్తుల స్వీకరణ
- పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు
- ఇప్పటికే కలెక్టర్‌లతో ఉన్నతాధికారుల టెలీకాన్ఫరెన్స్
- జిల్లాలో ఇదివరకు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 1389 పరిష్కారాలు
- పెండింగ్‌లో 4911 దరఖాస్తులు
- కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

ధరణిపై ఫోకస్!

కామారెడ్డి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ధరణి దరఖాస్తుల పరిష్కారంపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఇప్పటికే కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మాడ్యువల్స్ వారిగా క్షేత్రస్థాయి పరిశీలనతో పాటు విచారణ త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో భూ సమస్యల పరిష్కారం కోసం ఏళ్లగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రభుత్వం తాజా ఆదేశాలతో ఇక తమకు ఇబ్బందులు తొలగుతాయని భావిస్తున్నారు. పలు మాడ్యువల్స్‌తో మార్పులను చేసిన రాష్ట్ర ప్రభుత్వం తహసీల్దార్, ఆర్‌డీవో స్థాయిలో కూడా పరిష్కరించే అవకాశం కల్పించింది. దీంతో పెండింగ్ దరఖాస్తులకు ఎట్టకేలకు మోక్షం కల్గనుందనే అభిప్రాయం బాధిత రైతుల నుంచి వ్యక్తమవుతోంది.

40 శాతం మేర దరఖాస్తులకు పరిష్కారం

జిల్లాలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల్లో కొన్నింటికి పరిష్కారం లభిస్తోంది. గత మార్చి 1 నుంచి ధరణి సమస్యలపై రెవెన్యూ శాఖ స్పెషల్‌డ్రైవ్ చేపట్టింది. ఇందులో జిల్లాలో 40 శాతం మేర ధరణి సమస్యలను పరిష్కరించినట్లు తెలిసింది. జిల్లావ్యాప్తంగా 4911 ధరణి సమస్యలపై దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఎక్కువగా పాస్ పుస్తకాల్లో తప్పుల సవరణ కోసం 2457 దరఖాస్తులు ఉన్నాయి. వీటిలో 308 దరఖాస్తులను పరిష్కరించారు. మిగితా 2149 పెండింగ్‌లో ఉన్నాయి. గ్రివెన్స్ ల్యాండ్ మ్యాటర్స్ సంబంధించి 1020 దరఖాస్తులు ఉండగా ఇందులో 582 పరిష్కరించగా 438 పెండింగ్‌లో ఉన్నాయి. నిషేధిత భూములకు పట్టాపుస్తకాల జారీ కోసం 601 దరఖాస్తులు రాగా ఇందులో 18 పరిష్కారించగా 583 పెండింగ్‌లో ఉన్నాయి. పాస్ పుస్తకం లేకుండా వారసత్వ బదిలీ కోసం 242 దరఖాస్తులు రాగా, 129 పరిష్కరించగా 113 పెండింగ్‌లో ఉన్నాయి. మ్యూటేషన్‌లకై 201 దరఖాస్తులు రాగా 157 పరిష్కరించగా 44 పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు కేసులు 145 ఉండగా ఇందులో 58 పరిష్కారం చేయగా, 87 పెండింగ్‌లో ఉన్నాయి. పట్టాపాసుపుస్తకం లేకుండా నాలా కన్వర్షన్ కోసం 113 దరఖాస్తులు రాగా, 48 పరిష్కరించగా 65 పెండింగ్‌లో ఉన్నాయి. కోర్టు కేసులకు పట్టా పుస్తకాల జారీ కోరుతూ 40 దరఖాస్తులు రాగా, 23 పరిష్కారించగా 17 పెండింగ్‌లో ఉన్నాయి. నాలా మార్పిడి చేయాలంటూ 27 దరఖాస్తులు రాగా, 20 పరిష్కరించగా ఏడు పెండింగ్‌లో ఉన్నాయి. అమలు చేసిన జీపీఏకు 15 దరఖాస్తులు రాగా నాలుగు పరిష్కరించగా 11 పెండింగ్‌లో ఉన్నాయి.




ప్రభుత్వ ప్రత్యేక చొరవ

ధరణి దరఖాస్తులు సుమారు మూడేళ్ల నుంచి పెండింగ్‌లో ఉంటున్నాయి. పరిష్కరించే అధికారం తహసీలార్, ఆర్‌డీవోలకు లేక భారమంతా కలెక్టర్‌లు, సీసీఎల్‌ఏ పైనే పడింది. దీంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఎట్టకేలకు కొత్తప్రభుత్వం చొరవ చూపించడంతో గ్రివెన్స్ ల్యాండ్ మ్యాటర్, వారసత్వ బదిలీలు, భూసేకరణ సమస్యలు, ఖాతాల వీలీనం, పెండింగ్ మ్యూటేషన్‌లు, కోర్టు కేసులు, పాస్ పుస్తకాలు లేకుండా నాలా కన్వర్షన్ వంటికి కొన్నింటిని అధికారులు పరిష్కరించారు. జిల్లాలో అత్యధికంగా గ్రివెన్స్ ల్యాండ్ మ్యాటర్‌లకు సంబంధించినవే ఎక్కువగా పరిష్కరించారు.

పెండింగ్‌లో టీఎం 33 మ్యాడ్యుల్

ధరణిలో టీఎం 33మ్యాడ్యుల్ పరిధిలో వాటికే ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి.



ముఖ్యంగా తమ భూమి ప్రోబిహిటెడ్ ల్యాండ్ జాబితాలో చేర్చారని అందులోంచి తొలగించాలని కోరుతూ రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు రావడం లేదని భూమి తక్కువ విస్తీర్ణంలో పాస్ పుస్తకంలో నమోదైందని, పేర్లు తక్కువగా పడ్డాయని, మ్యూటేషన్ కోసం ఇలా రకరకాల భూ సమస్యలతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వీటి కోసం అధికారులు,కార్యాలయాల చుట్టు రైతులు చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు.

భూ సమస్యలపైనే ప్రజావాణి ఫిర్యాదులు

భూ రికార్డుల డిజిటలైజేషన్ కోసం గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ధరణి పోర్టల్‌ను అమలులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ ధరణితో జిల్లాలో వేలాది మంది రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. తమ భూసమస్యలను పరిష్కారం కోసం సంవత్సరాల తరబడి రెవెన్యూ అధికారుల చుట్టు తిరుగుతూ వచ్చారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో ధరణికి సంబంధించిన దరఖాస్తులే వస్తున్నాయి. ప్రతీ వారం నిరుపేద రైతులు వందల సంఖ్యలో కలెక్టరేట్ వద్దపడిగాపులు కాస్తుండడం పరిపాటిగా మారింది. తహసీల్దార్ కార్యాలయంలో సమస్యల పరిష్కారం కాకపోవడంతో దూరప్రాంతాల నుంచి కలెక్టరేట్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ధరణి దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టింది.

పెండింగ్‌లో 4వేలకు పైగా దరఖాస్తులు

భూ సమస్యలకు సంబంధించి జిల్లాలో వివిధ మ్యాడ్యువల్స్ కింద 4వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో అత్యధికంగా భూ విస్తీర్ణం, సర్వే నంబర్‌లో తప్పులు, పేరు మార్పిడీ, పట్టాల్లో తప్పులు దొర్లడం, డిజిటల్ సిగ్నిచర్ పెండింగ్ వంటి అంశాలకు సంబంధించినవే ఎక్కువగా ఉన్నట్లు సంబంధిత శాఖాధికారులు చెబుతున్నారు. వారసత్వం కింద పట్టామార్పిడీ కూడా అత్యధికంగా ఉన్నాయి. అలాగే నిషేధిత భూములు వ్యవహారాలకు సంబంధించిన దరఖాస్తులతోపాటు ఇతరత్రా సమస్యలతో కూడిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రభుత్వ ప్రత్యేకచొరవతో తమ సమస్యలు పరిష్కారమవుతాయని దరఖాస్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

రైతులకు పంట రుణాలు ఇవ్వడంలో
ఉదారంగా వ్యవహరించాలి: కలెక్టర్



బ్యాంకర్లు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డిటౌన్, జూన్19 :రైతులకు పంటరుణాలను అందించడంలో ఉదారంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ బ్యాంకర్లకు సూచించారు. బుధవారంకలెక్టరేట్‌లోని మిని సమావేశ మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులకు పలు సూచనలుచేశారు. పబ్లిక్‌ప్రైవేట్ సెక్టార్ బ్యాంకర్లు వివిధ పథకాల కింద యూనిట్ల గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని కోరారు. బ్యాంకుల వారిగా ప్రగతిని సమీక్షిస్తు గత ఆర్థిక సంవత్సరంలో పంటరుణాలు, టర్మ్‌లోన్స్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు, విద్యగృహనిర్మాణం తదితర రంగాలకు రూ.5569 కోట్లుఅందించాలని లక్ష్యంగాకాగా 78.60శాతం సాధించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఇకనైనా శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేస్తూ వందశాతం లక్ష్యాలను సాధించుటకు చిత్తశుద్ధితో కృషిచేయాలన్నారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కింద కోల్డ్‌స్టోరేజీలు, గోదాముల నిర్మాణాలకు బ్యాంకులు రుణాలందిస్తున్నందున పెద్దరైతులు వాటి నిర్మాణానికి ముందుకు వచ్చేలా ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయాధికారికి సూచించారు. 2016-17 నుంచి 2021-22 వరకు ఎస్‌సీ, ఎస్‌టీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ మంజూరై పెండింగ్ యూనిట్లను గ్రౌండింగ్ చేయాలన్నారు. మహిళా పారిశ్రామిక వేత్త లను ప్రోత్సహించుటకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నారీశక్తి చేపట్టిందని, ఈ పథకం కింద ఎటువంటి ప్రాసెసింగ్ చార్జీలు లేకుం డా రూ.2కోట్ల వరకు రుణాలు అందిస్తున్నదని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, లీడ్‌బ్యాంక్ మేనేజర్ రెహమాన్, తదితరులు ఉన్నారు.

వార్షిక రుణ ప్రణాళిక రూ.6412.60 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పంటరుణాలు, అగ్రికల్చర్ టర్మ్‌లోన్స్, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తదితర రంగాలకు రూ.6412.60 కోట్లు అందించనున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వార్షిక రుణప్రణాళికను ఆవిష్కరించారు. వార్షిక రుణప్రణాళికలో రూ.5610.28 కోట్లు అనగా 87.48 శాతం ప్రాధాన్యత రంగాలకు కేటాయించగా, రూ.802.28 కోట్లు అనగా 12.51 శాతం ఇతర రంగాలకు కేటాయించామన్నారు. ప్రధానంగా రూ.3425.85 కోట్ల మేర పంటల రుణాలు,రూ.732.38 కోట్లు టర్మ్‌రుణాలు కాగా రూ.537.73 కోట్లు వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్‌లు వంటి వ్యవసాయ అనుబంధ సాంకేతిక పరికరాల కొనుగోలుకు ఖర్చుచేయనున్నామన్నారు. కాగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు రూ.700.94 కోట్లు విద్య, గృహనిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలకు, పునరుత్పాదక శక్తికి రూ.213.38కోట్లు ఖర్చుచేయనున్నామని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, లీడ్‌బ్యాంక్ అధికారి రెహ్మాన్, కెనరా బ్యాంక్ రీజనల్ మేనేజర్ తోరత్ తదితరులు పాల్గొన్నారు.



మటన్‌మార్కెట్‌ను పరిశీస్తున్న చైర్‌పర్సన్

వ్యర్థాలను ఇష్టారీతిన పారేయొద్దు

- మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ

కామారెడ్డిటౌన్, జూన్19: మటన్ మార్కెట్‌లోని దుకాణదారులు వ్యర్థాలను ఇష్టారీతిన పారేయొద్దని కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్ర శేఖర్ రెడ్డి సూచించారు. కామారెడ్డి పట్టణంలోని మటన్ మార్కెట్‌ను బుధవారం చైర్‌పర్సన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారస్తులు పడుతున్న ఇబ్బందులను తీర్చేందుకు కృషిచేస్తానని తెలిపారు. దుకాణదారులు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యర్థాలను ఇష్టారీతిన పారేయకుండా ఒకచోటఉంచి మున్సిపల్ సిబ్బందికి అందించాలని తెలిపారు. మెయిన్‌గేట్‌తోపాటు నీటి సమస్యను తీరుస్తామని తెలిపారు. అనంతరం కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఉరుదొండ వనిత, మున్సిపల్ కమీషనర్ సుజాత, కౌన్సిలర్ కన్న య్య, పాతశివకృష్ణమూర్తి, చాట్ల వంశీ, అధికారులు పాల్గొన్నారు.



జుక్కల్‌లోని దోస్‌పల్లి, బంగారుపల్లి, తెలంగాణ ఉపపీఠానికి వచ్చిన జగద్గురు నరేంద్ర చార్య మహారాజన్‌ను మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. • మద్నూర్



- 161వ జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు
- జంక్షన్ల వద్ద వాహనదారుల తడబాటు
- రాంగ్ రూట్‌లో వస్తూ ప్రయాణిస్తూ ప్రాణాలు కోల్పోతున్న వైనం



హైవే పై ప్రమాదానికి గురైన కారు (ఫైల్)



ప్రమాదంలో కాలిపోయిన ఎక్సెల్ (ఫైల్)



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి (ఫైల్)

ప్రాణాలు మింగుతున్న జంక్షన్లు

పెద్దకొడప్‌గల్, జూన్19: జాతీయ రహదారుల్లోని జంక్షన్లు రక్తమోడు తున్నాయి. నిత్యం ఒకచోట ప్రమాదాలు సంభవిస్తూ అమాయకుల ప్రాణాలు మింగేస్తున్నాయి. జిల్లాలోని జుక్కల్ నియోజకవర్గం మీదుగా మంజూరైన 161వ జాతీయ రహదారి పనులను అధికారులు పూర్తిచేసి నాలుగు వరుసల జాతీయరహదారి నిర్మించారు. ఈ రహదారి నిజాంసాగర్ మండలం గుండా ప్రారంభమై పిట్లం, పెద్ద కొడప్‌గల్, జుక్కల్, బిచ్కుంద, మద్నూర్ మండలాల మీదుగా ప్రయాణం సాగుతోంది. ఈ రహదారి నిజాంసాగర్ మండలం నుంచి మద్నూర్‌వరకు సుమారు 70కిలోమీటర్ల మేర నిర్మాణమై ఉంది. రహదారి నిర్మించే సమయంలో ఆయాగ్రామాలకు వెళ్లేందుకు హైవే అధికారులు కొన్నిచోట్ల ఫ్లైఓవర్‌లు, మరికొన్ని చోట్ల జంక్షన్లు నిర్మించారు. ప్రస్తుతం ఈ జంక్షన్లు ప్రయాణికుల పాలిటశాపంగా మారుతున్నాయి. హైవే నుంచి జంక్షన్ల మీదుగా గ్రామాల్లోకి ప్రవేశించే సమయంలో లేదా లోపలి గ్రామాల నుంచి హైవే పైకి వెళ్లే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈప్రమాదాల్లో గ్రామీణ ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా పెద్దకొడప్‌గల్‌లోని బేగంపూర్ చౌరస్తాలో ఎక్సెల్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు ఘోరరోడ్డు ప్రమాదానికి గురయ్యారు.

జంక్షన్ల వద్దే ప్రమాదాలు

161వ జాతీయ రహదారిపై వాహనాలు 80 కిలో మీటర్ల వేగం నుంచి 120 కిలో మీటర్ల వేగంతో వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ రహదారి పై రెండు వరుసలు రహదారి ఉండగా ఒక వరుసలో వేగంగా వాహనాలు మరో వరుసలో నిదానంగా వెళ్లే వాహనాలు ప్రయాణిస్తుంటాయి. జంక్షన్ల నుంచి గ్రామాల్లోకి రాకపోకలు చేసే వాహనదారులు జాగ్రత్తగా ఉండకపోవడం, వాహనాలను గమనించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈనెల 15న బేగంపూర్ చౌరస్తాలో జంక్షను దాటే సమయంలో టీవీఎస్ ఎక్సెల్‌ను పార్చునర్ వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. గత ఏప్రిల్‌లో పోచారం చౌరస్తాలో వద్ద జుక్కల్ వైపునుంచి పోచారం గ్రామానికి బైకుపై వెళ్తున్న దెగ్లూర్ పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. దీంతో తరచూ జంక్షన్ల వద్ద ప్రమాదాలు చోటు చేసుకోవడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

రాంగ్ సైడ్ ప్రయాణాలతోనే..

రహదారిపై భద్రత సిబ్బంది సూచించిన విధంగా వాహనదారులు నిర్దేశించిన మార్గంలోనే వెళ్లాలి. కానీ కొంతమంది వాహనదారులు జంక్షన్ల వరకు వెళ్తే సమయం వృథా అవుతుందనే భావనతో రహదారిపై రాంగ్‌రూట్‌లో ప్రయాణం సాగిస్తున్నారు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను గమనించిక ప్రమాదాల బారిన తాము పడటమే కాకుండా ఎదుటివారికి ప్రమాదం జరగడానికి కారణమవుతున్నారు. అంతేకాకుండ రాంగ్‌రూట్‌లో వెళ్తే ఏమీ కాదన్న నిర్లక్ష్య భావనతో ప్రయాణం చేస్తున్నారు. గత రెండేళ్ల కిందట పిట్లం మండలం గద్దగుండు తండా పరిధిలో రాంగ్‌రూట్‌లో పిట్లం నుండి శంకరం పేట్ వైపు వెళ్తూ ముగ్గురు విద్యార్థులను లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు.

రహదారులపైనే పశువుల సంచారం

జాతీయరహదారిపై పశువులు రాకుండా గతంలో రహదారి నిర్మించే సమయంలోనే భద్రత సిబ్బంది రహదారికి ఇరువైపులా కంచెను ఏర్పాటుచేశారు. అయితే కొంతమంది గ్రామస్థులు తమ పశువులను మేపడానికి తీసుకువెళ్లే సమయంలో వాటిని వదిలివేయడంతో అవి రహదారిపైకి వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.



రహదారిపై వాహనాలకు ఎదురుగా వస్తున్న ఎద్దు

'బస్‌పాసుల కోసం కాలేజీలు, పాఠశాలలు యూజర్ ఐడీ, పాస్వర్డ్‌లు పొందాలి'

సుభాష్‌నగర్, జూన్ 19: విద్యార్థులు ఆర్టీసీ బస్‌పాస్‌ల కోసం కాలేజీ, పాఠశాలల యాజమాన్యాలు యూజర్ ఐడీ, పాస్వర్డ్‌లు పొందాలని నిజామాబాద్ ఆర్టీసీ ప్రాంతీయ అధికారి జానిరెడ్డి తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కళాశాలలు, పాఠశాలలు తెరుచుకున్న సందర్భంగా బస్‌పాస్‌ల కోసం రీజియన్‌లోని ఆరు డిపోలలో అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. బస్‌పాస్‌లు తీసుకునే విద్యార్థులు వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొబైల్ నెంబర్‌ను తప్పనిసరిగా ఇవ్వాలని కోరారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకున్న అనంతరం బస్ పాస్ ఫారంను పాఠశాల, కళాశాల యాజమాన్యాలు అప్రువల్ చేయాలన్నారు. అప్రువల్ చేసిన అనంతరం విద్యార్థి యొక్క మొబైల్ నెంబర్‌కు ఎస్ఎంఎస్ రూపంలో మెస్సేజ్ వస్తుందన్నారు. ఆ మెస్సేజ్‌ను స్థానిక బస్టాండ్‌లో ఉన్న బస్‌పాస్ కౌంటర్‌లో చూపించి బస్‌పాస్ పొందాలన్నారు. విద్యార్థినులు తప్పనిసరిగా ఆధార్ కార్డును కండక్టర్‌కు చూపించి ఉచిత ప్రయాణం చేయాలన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

షబ్బీర్ అలీ ఏ హోదాలో అధికారులతో రివ్యూ పెట్టారు

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

పెద్దబజార్, జూన్ 19: మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఏ హోదాలో కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ అధికారులతో రివ్యూ పెట్టారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రశ్నించారు. బుధవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి ప్రజలు చీకొట్టి తరిమేస్తే నిజామాబాద్‌కు వచ్చి అధికార అహంతో విర్రవీగుతున్న షబ్బీర్‌అలీకి అర్బన్ ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టారని ధ్వజమెత్తారు. ఏ హోదాలో అధికారులతో సమావేశం నిర్వహించారని ఆయన ప్రశ్నించారు. కామారెడ్డిలో చెల్లని రూపాయి ఇక్కడ ఎలా చెల్లుతుందనుకున్నారు అందుకు ఇందూరు ప్రజలు నీకు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అర్బన్ మీద ప్రేమ ఉంటే ఇక్కడ అనేక సమస్యలు ఉన్నాయని పదేళ్లలో ఒక్కరికి కూడా రేషన్ కార్డులు, పెన్షన్ సరిగా వస్తలేదన్నారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని దానిపై శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరిపి కావాల్సిన నిధులను మంజూరు చేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం వచ్చాక ప్రజాపాలన పెట్టి సమస్యలపై దరఖాస్తులను తీసుకున్నారని ఇప్పటి వరకు ఒక్క పని కూడా చేయలేదన్నారు. అర్బన్ ప్రజలు షబ్బీర్‌కు తగిన గుణపాఠం చెప్పినప్రజలు దొడ్డిదారి అధికారం చెలాయిస్తే ఊరుకునేది లేదన్నారు. జిల్లాలో అనేక సమస్యలు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో పనితీరుపై, డబుల్ బెడ్‌రూం ఇండ్లు వృథాగా ఉన్నాయని, మున్సిపల్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థపై ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు లక్ష్మీనారాయణ, న్యాలంరాజు, ప్రభాకర్, సాయివర్ధన్, మాస్టర్ శంకర్, వెల్డింగ్ నారాయణ, పల్నాటి కార్తిక్, తదితరులు పాల్గొన్నారు

క్రీడా అకాడమీలో ఎంపికలకు ఆహ్వానం

సుభాష్‌నగర్, జూన్ 19: తెలంగాణ క్రీడా అకాడమీలో ఈనెల 24, 25 తేదీల్లో ఎంపికలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ముత్తెన్న తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 16-18 సంవత్సరాలలోపు ఉన్న బాలురు, బాలికలు అర్హులని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రవేశాల కోసం క్రీడాకారుల యొక్క శారీరక క్రీడానైపుణ్యాన్ని పరిశీలించి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిప్పారు. సైక్లింగ్, రెజ్లింగ్ కోసం వెలోడ్రోమ్ అకాడమిలో సంప్రదించాలని అన్నారు. హాకీ అకాడమి కోసం వనపర్తి, అథ్లెటిక్స్ అకాడమి కోసం ఖమ్మం, వాలీబాల్ అకాడమి కోసం సరూర్ నగర్, రాజన్నసిరిసిల్లలో గల అకాడమిలో హాజరుకావాలన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు వయస్సు, స్టడీ సర్టిఫికెట్, పుట్టిన తేదీ సర్టిఫికెట్, 10 పాస్ పోర్టు సైజ్ ఫోటోలు, ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలన్నారు.

కారు బైక్ ఢీ : ఒకరి మృతి

బోధన్‌రూరల్, జూన్ 19: ఎడపల్లి మండల కేంద్రంలోని బ్రిడ్జి సమీపంలో బుధవారం రాత్రి కారు, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి రాకాసిపేట్ ప్రాంతానికి చెందిన కలేద్(30)అని ఎడపల్లి ఎస్సై తెలిపారు. కారును అదుపులోకి తీసుకున్నామని ఘటనపై పూర్తి విచారణ చేపడుతున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు. పూర్తి వివరాలు గురువారం వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

ఆపదలో ఆదుకునే వారే ప్రజాసేవకులు

● రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్, జూన్ 19: ఆపదలో ఉన్నవారిని ఆదుకుని అక్కున చేర్చుకోవడమే నిజమైన ప్రజాసేవ అని ఈ సేవా కార్యక్రమాల్లో ఇందూరు యువత ముందువరుసలో ఉండటం అభినందనీయమని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి అన్నారు. బుధవారం రూరల్ మండలం ధర్మారం(ఎం) గ్రామంలో ఇందూరు యువత ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైస్ బ్యాగ్ చాలెంజ్' కార్యక్రమానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కరోనా విపత్కర సమయంలో పేదలకు భోజనం అందజేయడంతో పాటు కరోనాతో మృతిచెందిన అనాథ శవాలకు వారి మతాచారం ప్రకారం కర్మకాండలు నిర్వహించడం అందరి వల్ల కాదని, ఎంతో మనోధైర్యం ఉంటే తప్ప ఇలాంటి కార్యక్రమాలు సాధ్యం కావన్నారు. రూరల్ మండలంలోని ధర్మారం (ఎం), మల్లారం, కొత్తపేట, మల్కాపూర్ తండా, గాంధీనగర్, ముత్తకుంట, లింగితండాల ప్రజలు తమకు తోచినంత బియ్యం విరాళం ఇచ్చారని సంస్థ నిర్వాహకులు సాయిబాబు తెలిపారు. 25 కిలోల చొప్పున 100 మంది రైతులు అన్నదానం కార్యక్రమంలో పాల్గొనడం గొప్పవిషయం అన్నారు. సేకరించిన ఈ బియ్యం ప్రతిరోజు పేదలకు అన్నదానం చేసేందుకు ఉపయోగిస్తామని సాయిబాబు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ముప్ప గంగారెడ్డి, కెతావత్ యాదగిరి, కుమార్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బొల్లం రాజన్న, కొర్వ గంగాదర్, మోహన్, లింగం, పూర్ణచందర్ రాజు, ఆదేప్రవీణ్ ఇందూరు యువత సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

దేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఎప్పటికీ సురక్షితం కాదని అవి ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉందని, భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. బుధవారం ధర్మారం (ఎం) గ్రామంలో రాహుల్ గాంధీ జన్మదినం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ముప్ప గంగారెడ్డి, కెతావత్ యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, కుమార్‌రెడ్డి, కొర్వ గంగాదర్, మోహన్ పాల్గొన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ల నియామక రాతపరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

నిజామాబాద్ అర్బన్, జూన్ 19: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా జూన్ 24 నుంచి 29 వరకు జరుగనున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల వెల్ఫేర్ ఆఫీసర్ల నియామక రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. పరీక్ష ప్రారంభమయ్యే మూడురోజుల ముందు నుంచి కమిషన్ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన అభ్యర్థులకు సూచించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30లకు వరకు, మధ్యాహ్నం 2.30ల నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్స్‌లలో పరీక్షలు కొనసాగుతాయని పరీక్ష రాసే అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనల గురించి అభ్యర్థులకు పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని సూచించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా వేలి ముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఉదయం 8.30ల నుంచే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, 9.30లకు పరీక్ష కేంద్రం గేట్లు మూసివేయడం జరుగుతుందని, అదే విధంగా మధ్యాహ్నం జరిగే పరీక్షకు కూడా గంట ముందే అనుమతిస్తామని గేట్లు మూసివేసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లో అనుమతించమన్నారు. అభ్యర్థులు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, బుక్కులు, హ్యాండ్‌బ్యాగ్‌లు, పౌచ్‌లు, ఇతర ఎలాంటి వాటిని తీసుకురావద్దన్నారు. షూస్ వేసుకోవద్దని చెప్పులు ధరించాలని బయోమెట్రిక్‌కు ఆటంకం కలిగించేలా మెహెందీ, ట్యాటూలు ఏవైనా ఉంటే అనుమతించమన్నారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాన్ని ముందుగానే చూసుకొని వస్తే పరీక్ష రోజు ఇబ్బంది ఉండదని ఆయన తెలిపారు.

అవినీతికి తావు లేకుండా నియోజకవర్గ అభివృద్ధి

● ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ● అంకాపూర్, పెర్కిట్‌లో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పరిశీలన

ఆర్మూర్‌రూరల్, జూన్19: ఎలాంటి అవినీతికి తావు లేకుండా ఆర్మూర్ నియోజకవర్గ అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం అంకాపూర్, పెర్కిట్, ఆర్మూర్ పట్టణంలో నిర్మాణంలో ఉన్న డబుల్‌బెడ్‌రూంలను ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పరిశీలించారు. డబుల్‌బెడ్‌రూంల నిర్మాణాలు చివరిదశలో ఉన్నాయని, రాజకీయాలకు అతీతంగా నిజమైన అర్హులకు ఇళ్ళను కేటాయించాలని అధికారులకు సూచించామన్నారు. గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేసి పారదర్శ కంగా ఇళ్లు కేటాయించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆర్మూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్మూర్ ప్రాంత అభివృద్ధికి నిధుల కోసం సీఎం రేవంత్‌రెడ్డితో పాటు నలుగురు మంత్రులను కలిసి చర్చించామన్నారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి, మంత్రులు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆర్మూర్‌లో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ ఏర్పాటుకు రూ.150కోట్లు మంజూరు ఇవ్వాలని సీఎంను కోరామన్నారు. ఇందుకు 25ఎకరాల స్థల పరిశీలన చేయనున్నామన్నారు. అదే విధంగా ఆర్మూర్ నియోజకవర్గానికి పదివేల ఇళ్లు మంజూరు చేయా లని విన్నవించామని, స్థలాలు ఉన్న వారికి 3500 ఇళ్లు కావాలని కోరినట్టు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి తెలిపారు. రైల్వేశాఖ మంత్రిని కలిసి ఆర్మూర్ నుంచి డిచ్‌పల్లి రైల్వేలైన్ వేయాలని కోరామని, సర్వే జరపడానికి అధికారులను పంపిస్తామని తెలిపారన్నారు. జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని సంబంధిత మంత్రికి, అధికారులకు విన్నవించామన్నారు. వాయు, రైల్వే, బస్సు రవాణాకు ప్రాధాన్యత ఇవ్వాలని తాను కోరినట్టు ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ గజానన్, బీజేపీ నాయకులు కంచెట్టి గంగాధర్, కలిగోట గంగాధర్, జగిర్దార్ శ్రీనివాస్, ఆకుల రాజు, జెస్సు అనిల్, ద్యాగ ఉదయ్, ఎంపీటీసీ రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

'అధిష్ఠానం నిర్ణయానికి లోబడి ఉండాలి'

బాన్సువాడటౌన్ , జూన్ 19 : కాంగ్రెస్ నాయకులు పార్టీ పరువును అప్రతిష్ట పాల్జేయొద్దని, అధిష్ఠానం తీసుకునే నిర్ణయాలకు లోబడి ఉండాలని బాన్సువాడ మాజీ ఎంపీటీసీ దేవిక్రష్ణ ప్రసాద్ ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం , రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కాడవం సంతోషంగా ఉందన్నారు. 45 ఏళ్ల సుధీర్ఘ అనుభవం ఉన్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వస్తున్నాడనే వార్తలపై కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు అడ్డుకుంటామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకునే అంశం అధిష్ఠానం చూసుకుంటుందన్నారు. మాజీ ఎమ్మెల్యే , బాన్సువాడ కాంగ్రెస్ ఇంచార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి ఇప్పటి వరకు పోచారంను కాంగ్రెస్‌లోకి రానివ్వమని ఎక్కడా చెప్పలేదన్న విషయాన్ని కార్యకర్తలు గమనించాలని కోరారు.

నిబంధనల మేరకు హోటళ్లు, రెస్టారెంట్‌లు నడపాలి : సీపీ

ఖిల్లా, జూన్ 19: పోలీస్ కమిషనరేట్ పరిధిలో హోటల్స్, రెస్టారెంట్‌లు, గేమింగ్ జోన్‌లు, అమ్యూజ్‌మెంట్ పార్క్‌లు, ఎస్టాబ్లిష్‌మెంట్ నిర్వహించే వారు సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగనెవార్ తెలిపారు. కొన్నిచోట్ల సంబంధిత శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల భద్రతకు కావాల్సిన నియమనిబంధనలు పాటించకుండా ఎటువంటి హోటల్స్, రెస్టారెంట్‌లు నడిపించరాదని హెచ్చరించారు. ఎవరైనా సంబంధిత శాఖల నుంచి భద్రతకు సంబంధించి అనుమతి తీసుకోని పరిస్థితుల్లో పోలీస్ శాఖ, సంబంధిత శాఖలతో అటువంటి వాటిపై దాడులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖ ఆదేశాలను పాటిస్తూ నిబంధనలకు వ్యతిరేకంగా ఎటువంటి వ్యాపారాలు నిర్వహించరాదని తెలిపారు.

సిర్పూర్ వాసి బెహరాన్‌లో మృతి

మోపాల్, జూన్ 19: మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన చెన్నా రు బాల్‌రాజ్ (45) కరెంట్ షాక్‌తో బెహరాన్‌లో మృతిచెందిన సంఘటన గ్రామంలో తెలియడంతో విషాదఛాయలు నెలకొన్నాయి. బతుకుదెరువు కోసం భార్య, పిల్లలను వదిలి బెహరాన్‌కు వెళ్లిన బాల్‌రాజ్ కరెంట్ షాక్‌తో ఈనెల 15వ తేదీన మృతిచెందాడు. విషయం కుటుంబ సభ్యులకు బుధవారం సమాచారం అందింది. సమాచారం. 20 సంవత్సరాల క్రితం బెహరాన్‌కు వెళ్లి వస్తూ పోతున్నాడని గ్రామస్తులు తెలిపారు. అక్కడ బాల్‌రాజ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగలడంతో మృతి చెందడంతో అక్కడ ఉన్న స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం అం దించారు. మృతదేహం కోసం కుటుంబ సభ్యులు, వారి బంధువులు, గ్రామస్తులు ఎదురు చూస్తున్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

తొర్లికొండ పాఠశాలలో 30మంది విద్యార్థుల చేరిక

జక్రాన్‌పల్లి, జూన్ 19: మండలంలోని తొర్లికొండ పాఠశాలలో గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల బుధవారం పలువురు విద్యార్థులు చేర్పించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగం అశోక్ తెలిపారు. ఈ పాఠశాలలో సుమారు 30మంది విద్యార్థులు చేరినట్టు ఆయన తెలిపారు. విద్యార్థులకు రికార్డు షీట్‌ను ఎంఈవో శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ బాలుర వసతిగృహం వార్డెన్ చిట్యాల సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన

బోధన్‌రూరల్,జూన్19: ధరణి సమస్యలపై మండలంలోని అన్ని గ్రామాలలో క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపుతున్నామని బోధన్ తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. మూడు బృందాలుగా బోధన్ మండలంలోని అన్ని గ్రామాలో పర్యటించి గ్రామాలలో ప్రజల వద్ద ధరణిలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటన జరిపి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు.

పంటల సాగు వివరాలు నమోదు చేయాలి : జిల్లా వ్యవసాయాధికారి

డిచ్‌పల్లి,జూన్ 19: వానకాలం పంటల సాగులో రైతులు ఏ సర్వే నంబర్‌లో ఏ పంటలు సాగు చేస్తున్నారో సమగ్రమైన వివరాలను వ్యవసాయాధికారులు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వాజీద్ హుస్సేన్ అధికారులకు ఆదేశించారు. బుధవారం ఆయన డిచ్‌పల్లి మండలంలోని ముల్లంగి గ్రామ శివారులో క్రాప్ బుకింగ్ వెరిఫికేషన్ లో భాగంగా పర్యటించారు. రైతులకు వానకాలం పంటల సాగులో ఎటువంటి సందేహాలు ఉన్నా వ్యవసాయ విస్తీర్ణాధికారులు నివృత్తి చేయాలని రైతుల పంటల సాగు వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఫర్టిలైజర్ దుకాణాలలో విక్రయాలపై నిఘా ఉంచాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి వెంట మండల వ్యవసాయాధికారి రాంబాబు, ఏఈవో భావన, రూపేశ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

రుద్రూరు, జూన్ 19: రుద్రూరు మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్, మండల నాయకులు నడిపింటి నగేష్, ఎంపీటీసీ గౌస్, వరప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

ముప్కాల్:ముప్కాల్, బాల్కొండ మండలాల్లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం బాల్కొండ ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యంరెడ్డి రోగులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు చిన్నారెడ్డి, ముస్కు మోహన్, కొమ్ముల శ్రీనివాస్, ఏలేటి విజయ్, మల్లారెడ్డి, జైడి రవి, జక్క రాజేశ్వర్, మల్లారెడ్డి, ముత్తెన్న, బద్దం సాగర్, తదితరులు పాల్గొన్నారు.

మెండోర: మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్తింటి ముత్యంరెడ్డి, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు పలకలు పెన్సిల్‌లు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మెండోర టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండల కాంగ్రెస్ కార్యాలయంలో అధ్యక్షుడు సుంకెట రవి కేక్‌కట్‌చేసి పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ పథకాల అమలు వివరాలను ప్రజలకు చేరవేస్తు గ్రామీణ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్, తక్కూరి దేవేందర్, పాలెపు నర్సయ్య, బుచ్చిమల్లయ్య, ప్రసాద్, గంగారెడ్డి, శ్రీనివాస్, ప్రదీప్, శ్రీరాముల మురళి, దూలూర్ కిషన్ గౌడ్, శేఖర్, అజాహరోద్దీన్ , నల్ల సాయికుమార్,

నవీపేట: ఏబసీసీ నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సమీపంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. అనంతరం స్టేషన్ ఏరియాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: కార్యక్రమానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని రాహుల్‌గాంధీ నాయకత్వంలో రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత ముందుకు వెళ్తుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు సుధాకర్, వెంకట్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, మోతిలాల్, సాయేందర్, రాజేందర్, చింతల కిషన్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : జక్రాన్‌పల్లిలో రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, ఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాట్‌పల్లి నర్సారెడ్డి, జైడి మల్లేష్, సురేష్, రాజు, లక్ష్మణ్, అక్బర్‌ఖాన్, సుదీర్, ప్రశాంత్, ప్రేమ్‌కుమార్, జనార్థన్, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లపంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ డెలిగేట్ గంగాశంకర్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండబోదని రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ దేశానికి ప్రధానమంత్రి కావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్ చారి, నాయకులు దాము, శరత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు ఎల్లం, గౌసోద్దీన్, నాయకులు డబ్బు, ఆదినారాయణ, నవీన్, విష్ణువర్ధన్, బడు, ఇనాయత్ అలీ, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. సాలూర గ్రామంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూర మండల కేంద్రంలో కేక్ కట్ చేసి రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా మండల అధ్యక్షులు మందర్నా రవి మాట్లాడుతూ భావి భారత భవిష్యత్ ఆశ కిరణం రాహుల్ గాంధీ అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, సాలూర కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లె రమేష్, శ్రీనివాస్ రెడ్డి, సాయిలు, మాజీ ఎంపీటీసీ శంకర్, అనిల్, రాహుల్, లక్ష్మణ్, దేవదానం, ఖాజాపూర్ అశోక్, సాలూర మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు విద్యాబోధనపై శిక్షణ



మద్నూర్‌లో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న సీడీపీవో సునంద

మద్నూర్,జూన్19: అంగన్‌వాడీ టీచర్లు ఇక నుంచి విద్యార్థులకు నూతన విద్యాబోధన చేయాలని మద్నూర్ ప్రాజెక్టు సీడీపీవో సునంద సూచించారు. బుధవారం మద్నూర్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్లకు విద్యాబోధనపై శిక్షణ ఇచ్చారు.ఇప్పటివరకు అంగన్‌వాడీ కేంద్రాలద్వారా గర్భిణులు,బాలింతలు,పిల్లలకు పోషకాహారం అందించి అహ్లాదకరమైన వాతావరణంలో ఆట, పాటలతో విద్యాబోధన చేపడుతున్నారు. ఇక నుంచి ప్రభుత్వం అంగన్‌వాడీలను ప్రీస్కూల్స్‌గా సిద్ధం చేయడంతో ప్రీ స్కూల్‌లో మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ స్థాయిలుగా ప్రేరణాత్మకకృత్యాధార బోధన ఉంటుందని తెలిపారు. జూన్ నుంచి ఆగస్టు వరకు ఆటపాటలు, ప్రకృతి సైన్స్, యోగ, పూర్వగణితం, రంగులు ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తారని అన్నారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ కార్యక్రమాలతో పాటు కృత్యాలతో పిల్లలకు విద్యాబోధన చేయాలని అన్నారు. నాలుగో శనివారం పూర్వ ప్రాథమిక విద్యా దినోత్సవం జరిపి కృత్యాలు కార్యక్రమాలను ప్రదర్శించాలని తెలిపారు.పిల్లల్లో వచ్చిన మార్పులు, అభివృద్ధిని తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సూపర్ వైజర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

సికెల్‌సెల్ అనిమియాపై అవగాహన



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ

గాంధారి,జూన్ 19:రక్తహీనతకు సంబంధించిన వ్యాధి వంశపారం పర్యంగా రాకుండా ఉండడానికి తగు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు బ్లడ్‌టెస్ట్ ద్వారా తెలుసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సత్యనారాయణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సికిల్‌సెల్ ఎనిమియాపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సికిల్‌సెల్ వ్యాధి సాధారణంగా ఆరునెలల వయసులో ప్రారంభమై అవి ఒక వ్యక్తి నుంచి మరోక వ్యక్తికి భిన్నంగా ఉంటాయని అవి కాలాక్రమేణ మారవచ్చని తెలిపారు. రక్తహీనత,దీర్ఘకాల కామెర్లు ఉండడం,చాతి దగ్గర,చేతులువాపులు,యుక్తవయస్సు పెరుగుదలలో జాప్యం ఉంటుందని తెలిపారు. నీటిని పుష్కలంగా తాగాని హిమోగ్లోబిన్ కల్పించే పండ్లను తీసుకోవాలని క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమాధికారి అంబాజీ, స్థానిక వైద్యులు ప్రవీణ్‌కుమార్, గురుకుల ప్రిన్సిపల్ సోమ్లానాయక్, వార్డెన్ నవీన్, ఎంపీ టీసీ రాజు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 గ్రాండ్ టెస్ట్‌ల నిర్వహణ

కామారెడ్డిరూరల్,జూన్19:తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహించే గ్రూప్-2 ఎగ్జామినేషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్ట్‌లను నిజామాబాద్ బీసీ స్టడీ సర్కిల్లో నిర్వహించనున్నట్లు డైరెక్టర్ సి.హెచ్.వెంకన్న బుధవారంఒక ప్రకటనలో తెలిపారు. మొదటి గ్రాండ్ టెస్ట్ 08జూలై2024,09 జూలై 2024,రెండో గ్రాండ్ టెస్ట్ 15 జూలై 2024,16 జూలై2024,మూడో గ్రాండ్ టెస్ట్ 22జూలై 2024, 23 జూలై 2024, నాలుగో గ్రాండ్ టెస్ట్ 30జూలై2024, 31జూలై2024 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు,మధ్యాహ్నం 1:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు ఉంటుందని ఏ గ్రాండ్ టెస్ట్‌నైనా హాజరు కావాలనేకునే ఆసక్తి గల అభ్యర్థులు టీజీబీయస్‌స్టడీ సర్కిల్. సిజిజి.జిఓవి.ఇన్‌లో ఆన్‌లైన్ ద్వారా 19 జూన్2024 నుంచి 05జూలై2024 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.వివరాలకు 08462-241055ను సంప్రదిం చాలన్నారు.

గడికోటలో పర్యాటకుల సందడి

దోమకొండ,జూన్ 19:మండల కేంద్రంలోని గడికోటకు బుధవారం పర్యాటకుల తాకిడి నెలకొంది. నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తిలక్ గార్డెన్ వాకింగ్ ఫ్రెండ్స్ సుమారు 20 మంది మహిళలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున పర్యాటకులు కోటను సందర్శించారు. కోటలోని రాజభవనం, అద్దాలమేడ,చుట్టూ కందకం, శివాలయం కోట చరిత్రను తిలకించి, కోట చరిత్ర, వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

నేరాలపై సమీక్ష సమావేశం

దోమకొండ, జూన్ 19:దోమకొండ పోలీసు స్టేషన్‌లో బుధవారం కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాత కేసుల వివరాలను పోలీసు స్టేషన్‌ల వారిగా ఎస్సైలు డీఎస్పీకి తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గత ఎన్నికలు ప్రశాంత వాతవారణంలో జరిగేలా విధులు నిర్వహించిన సీఐలు, ఎస్సైలు, సిబ్బందిని అభినందించారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ తప్పకుండా నిర్వహించాలన్నారు.ఎవరైన అనుమానితులుగా కనిపిస్తే అదుపులోకి తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని సూచించారు. ఈ కార్యక్రమంలో భిక్కనూరు,కామారెడ్డి రూరల్, కామారెడ్డి టౌన్, సీఐలు సంపత్‌కుమార్, రామన్,చంద్రశేఖర్‌రెడ్డి, దోమకొండ, బిక్కనూరు, బీబీపేట, మాచారెడ్డి, కామారెడ్డి, రాజంపేట, ఎస్సైలు గణేష్, సాయికుమార్, ప్రభాకర్, శ్రీనివాస్, అనిల్‌కుమార్, సంపత్, ఏఎస్సై సుబ్రహ్మణ్యచారీ తదితరుల పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



బొల్లారం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న జడ్పీటీసీ

నాగిరెడ్డిపేట,జూన్ 19:మండలంలోని బొల్లారం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం మధ్యాహ్నం భోజనాన్ని స్థానిక జడ్పీటీసీ మనోహర్ రెడ్డి పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాలలో జరు గుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఆయన పరిశీలించారు. పనులు వేగవంతంగా, నాణ్యతగా జరపాలని ఆయన కోరారు. పాఠశాలలో క్రీడల్లో ఉత్తమ సేవలందించి విద్యార్థులు జిల్లా, రాష్ట్రస్థాయికి ఎదిగేలా కృషి చేసి బదిలీపై వెళుతున్న పాఠశాల పీఈటీ ఉపాధ్యాయుడు నరేష్ రెడ్డిని ఆయన ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాసుల జారీపై స్పందించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిజాంసాగర్, జూన్ 19: ఆర్టీసి బస్‌పాసులు జారీ చేయక విద్యార్థులు అవస్థలు పడుతుండటంతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం "ఆర్టీసి బస్‌పాసుల జారీ ఎన్నడో" అనే కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. కామారెడ్డి డిపో మేనేజర్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో లాగిన్ ఓపెన్ ఉందని, ప్రధానాచార్యులు, సంబంధిత బాధ్యులు గమనించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు ఆన్‌లైన్‌లోని ఆర్టీసీ లాగిన్‌లో బస్‌పాసుల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో పలువురు అభినందించారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



బీర్కూర్‌లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



మద్నూర్‌లో..

కామారెడ్డిటౌన్, జూన్ 19:కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీకార్యాలయంలో రాహుల్ గాంధీ 53వ జన్మదిన కార్యక్రమాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనేశ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మన్‌లు కేక్‌కట్‌చేసి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఇషాక్‌షేర్, ప్రసన్నకుమార్, సలీం, పంపరి శ్రీనివాస్, బీసీసెల్ అధ్యక్షుడు పుట్నాల శ్రీనివాస్‌యాదవ్,తదితరులు పాల్గొన్నారు.

గాంధారి:మండలంలోని మేడిపల్లి గ్రామంలో బుధవారం రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా సీపీఎస్ పాఠశాలలో కాంగ్రెస్ నాయకులు నోట్‌బుక్కులు, పెన్సిల్‌లు,అరటిపండ్లు పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో అధ్యక్షుడు ఎండీ అక్బర్, యూత్ అధ్యక్షుడు వెంకటరావు,మాజీ ఎంపీటీసీఅజీముద్దిన్,గ్రామపెద్దలు పెద్దసాయిలు, షాదుల్, యూసుఫ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్:మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను స్థానిక నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈకార్యక్ర మంలో బీర్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయిని శంకర్, గ్రామ అధ్యక్షుడు యామ రాములు, జిల్లా సీనియర్ నాయకుడు బసవ రాజు పటేల్, డీసీసీ కార్యదర్శి కొత్తకాపు కాంత్‌రెడ్డి, పోగునారాయణ, హైమద్, సొసైటీ డైరెక్టర్ బోయిన గంగాధర్, పీరయ్య, సత్యం, వెంకటేశ్వర్లు, మొగులయ్య, బ్రహ్మం, దేవానంద్ దేశాయ్, నాగరాజు, ఆంజనేయులు, సాయిలు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్నూర్:ఉమ్మడి మద్నూర్ మండలంలోని మద్నూర్, డోంగ్లీ మండలాల్లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలలో ఆయన ఫొటోలుపెట్టి కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ భారత దేశాన్ని ప్రగతి శీల భవిష్యత్తు వైపు నడిపించగలిగే ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. డోంగ్లీ మండల కేంద్రంలోని ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మద్నూర్, డోంగ్లీ మండ లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిలు, బస్వరాజ్, నాయకులు రమేష్, కుశాల్, రాములు, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, నాయకులు సంతోష్, రామ్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంలో బుధవారం రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా మండల అధ్యక్షుడు నందు ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు అయినాల లింగం, దుర్కి పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, ఎక్స్ జడ్పీటీసీ కిషోర్ యాదవ్, కుమ్మరి నారాయణ,మాజీ సర్పంచ్ హాజీపూర్ చంటి, కోఆప్షన్ మెంబర్ వాజీద్ హుస్సేన్,మండల కార్యదర్శి శివప్రసాద్, మండల మైనారిటీ అధ్యక్షుడు యూసుఫ్, మాజీ సర్పంచ్ నారాగౌడ్, ఎక్స్‌సర్పంచ్ శాంతయ్య, ఎక్స్‌ఎంపీటీసీ శంకర్ నాయక్, ఎక్స్‌సర్పంచ్ అన్నం సత్యనారాయణ, భాగ్యనాయక్, మిర్జాపూర్ సొసైటీ చైర్మన్‌రాంబాబు, తూముసాయాగౌడ్, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగంపేట: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయంలోమండల పార్టీ అధ్యక్షుడు బుర్రనారాగౌడ్ కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారత్‌జోడో యాత్రలో రాహుల్ గాంధీ దేశ ప్రజల సమస్యలు వింటూ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని అన్నారు. దేశంలో బలమైన ప్రతిపక్షంగా కాంగ్రెస్‌పార్టీని నిలబెట్టారని నిజమైన గెలుపు కాంగ్రెస్ పార్టీదేనని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నయీం,రవి, ప్రసాద్‌గౌడ్, సాయికుమార్, ఇబ్రహీం, ఖయ్యూం పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి:ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలోబుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మండల అధ్యక్షుడు కుర్మా సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, సీనియర్ నాయకు లు చెన్న లక్ష్మణ్, గయాజుద్దీన్, నాగం గోపి కృష్ణ, శ్రీనివాస్, గఫర్ తది తరులు పాల్గొన్నారు.

బిక్కనూర్: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల్లో రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కెక్ కట్ చేసి రాహుల్‌గాంధీకి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు భీంరెడ్డి, డీసీసీ ఉపాధ్యాక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

'పోచారానికి కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి అర్హత లేదు'

నసురుల్లాబాద్, జూన్ 19: మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మండల నాయకులు మాట్లాడుతూ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి పదవు లు లేకుంటే ఉండలేక కాంగ్రెస్ పార్టీలో రావాలని చూస్తున్నారని పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కాం గ్రెస్ పార్టీలోకి వచ్చే అర్హత లేదన్నారు. నసురుల్లాబాద్ మండల కేం ద్రంలో నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున భారీ సంఖ్యలో పాల్గొన్న కాం గ్రెస్ పార్టీ నాయకులు అవసరమైతే రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలోకి రానియకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని మండల కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో ఎ మ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఎట్టి పరిస్థి తుల్లో కాంగ్రెస్ పార్టీలోకి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని రానివ్వమని అన్నా రు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, గ్రామపార్టీ అధ్యక్షుడు అయినాల లింగం, మాజీ జడ్పీటీసీ కిషోర్ యాదవ్, మండల కోఆప్షన్ మెంబర్ ముస్తఫా వాజీద్ హుస్సేన్, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, మిర్జాపూర్ సొసైటీ చైర్మన్ రాంబాబు, నాయకులు, తూము సాయాగౌడ్, నారాగౌడ్, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షుడు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



నసురుల్లాబాద్‌లో పోచారం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని , ఆయన రాకను అడ్డుకుంటామని బాన్సువాడ కాంగ్రెస్ నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారనే వార్తలపై ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని వారు ప్రశ్నించారు. ఆయన అన్ని పార్టీలలో పదవులు అనుభవించారని , మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పార్టీ మారతాననడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ పాత బాలకృష్ణ, మంత్రి గణేష్, మదుసూధన్‌రెడ్డి ఉన్నారు.

సోయాబ్యాగుల్లో కుళ్లిన విత్తనాలు



దుకాణం వద్దకు కుళ్లిన విత్తనాలను తీసుకువచ్చిన రైతుదీప్‌చంద్

బిచ్కుంద, జూన్ 19:మండల కేంద్రంలోని జైకిసాన్ ఎరువుల దుకాణంలో భద్రల్ తండాకు చెందిన దీప్‌చంద్ అనే రైతు పదిరోజుల క్రితం రూ. 3100లతో కావాల్సిన సోయా బ్యాగులు కొనుగోలు చేశారు. సోమవారం సాయంత్రం చదునుచేసిన భూమి తడిచేవిధంగా వర్షం పడడంతో మంగళవారం సోయా విత్తనాలు అలికేందుకు కొను గోలుచేసిన సోయాబ్యాగులను తెరిచేసరికి కుళ్లిపోయి విత్తనాలు రంగుమారడంతో రైతు దీప్‌చంద్ ఆశ్చర్య పోయాడు.కుళ్లిన విత్తనాలను తీసుకుని వచ్చి దీప్‌చంద్ దుకా ణదారున్ని ప్రశ్నించడంతో తనకు ఏమి సంబంధం లేదని నిర్లక్ష్యం మాట్లాడడంతో మిగిలిన రైతులతో దుకాణం వద్ద దీప్‌చంద్ నిరసన తెలిపారు.అలాగే పోలీసుస్టేషన్‌కు వెళ్లి సదరు దుకాణయాజమానిపై ఫిర్యాదుచేశాడు.ఈ విషయం తెలుసుకున్న ఏడీఏ లక్ష్మీప్రసన్న,ఏవో రాజలింగం పోలీసుస్టేషన్‌కు వెళ్లి విత్తనాలను పరి శీలించి ఆశాంపిల్స్‌ను పరీక్షలకు పంపుతామని తెలిపారు. అనంతరం జైకిసాన్ ఎరువుల దుకాణంలో నిలువచేసిన బ్యాగులను గోదాములన్నిటిని పరిశీలించి దిగుమతి చేసిన సోయా కంపెనీలన్ని విత్తనాల రికార్డులను పరిశీలించారు. రైతులను మోసగించేందుకు డీలర్‌లు నాసిరకం విత్తనాలను అమ్మితే లైసెన్స్ రద్దుతో పాటుశాఖపరంగా చర్యలు చేపట్టి కేసు నమోదుచేస్తామని తెలిపారు.

పశువులను రోడ్లపై వదిలితే చర్యలు

కామారెడ్డిటౌన్, జూన్ 19:కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఇష్టారీతిన రోడ్లపై పశువులను వదిలితే కఠినచర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమీషనర్ సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్‌పరిధిలో రోడ్లపై సంచరిస్తున్న ఆవులు,గేదెల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వీధులు, ప్రదాన రహదారులు అపరిశుభ్రంగా మారుతున్నాయని తెలిపారు. మున్సిపల్ యాక్ట్ 2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీర్కూర్‌లో ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం



సురేఖ,పిల్లలు (ఫైల్)

బీర్కూర్,జూన్ 19:బీర్కూర్ మండల కేంద్రానికి చెంది న సురేఖ అనే మహిళ ఈనెల 16వ తన ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైంది. ఈ మేరకు సురేఖ భర్త మైసబోయి బీర్కూర్ పోలీస్‌స్టేషన్‌లోఫిర్యాదు చేశారు. గత కొన్నాళ్లుగా భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. భర్త రోజు తాగి రావడం, గొడవ పడుతుండటంతో సురేఖ తీవ్ర ఆవేదనకు గురైంది. ఈ నెల 16న కిరాణా షాపుకు వెళ్లి వ స్తానని ఇంట్లో చెప్పి పిల్లలతో కలిసి బయటకు వెళ్లింది.రాత్రి అయినా ఇంటికిరాకపో వడంతో మైస బోయి భార్య పిల్లల కోసం గ్రామంలో గా లించా డు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త మహిళా సంఘాలను ఏర్పాటు చేయాలి



బీర్కూర్‌లో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్

బీర్కూర్, జూన్ 19: గ్రామ సంఘాలలో చేరని మహిళల ను గుర్తించి కొత్త మహిళా సంఘాలను ఏర్పాటు చేయాలని ఐకేపీ ఏపీఎం గంగాధర్ వీవోఏలకు ఆదేశించారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో వీవోఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహిళలతో కొత్తగా సంఘాల ఏర్పాటు చేయడంతో పాటు దివ్యాంగులతో కూడా కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీజీబీ మేనేజర్ క్రాంతి, మేనేజర్ మహేందర్, సీసీఎస్, వీవోఏలు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

తాడ్వాయి,జూన్19:మండలం కృష్ణాజీవాడి గ్రామంలో బుధవారం ఎల్లా రెడ్డి,కామారెడ్డిరోడ్డుపై జరిగినరోడ్డు ప్రమా దంలో ఇద్దరికి తీవ్రగాయాల య్యా యి. రాజంపేట మండలం ఆర్గొండ గ్రామానికి చెందిన రాజు,సదానందంలు బైక్‌పై కామా రెడ్డి నుంచి తాడ్వాయికి వెళ్తున్నారు. తాడ్వాయి నుంచి కామా రెడ్డికి వెళ్తున్న కారును బైక్‌ను గట్టిగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగా యాలు అయినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే స్పం దించిన స్థానికులు ఇద్దరిని చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆసు పత్రికి తరలించారు.ఈవిషయమై తాడ్వాయి పోలీసులు కేసునమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి కుంటలో జారిపడి ఒకరి మృతి

పెద్ద కొడప్‌గల్, జూన్ 19: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి వ్యక్తి మృ తి చెందిన సంఘటన ఒకటి పెద్ద కొడప్‌గల్ మండలంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా..మండల కేంద్రానికి చెందిన హలిగె సాయిలు (28) బుధవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి మాల కుంటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెందాడని పోలీసులు తెలిపారు.మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోనారెడ్డి తెలిపారు.

డీటీగా ప్రవీణ్‌కుమార్

సదాశివనగర్,జూన్ 19:సదాశివనగర్ డిప్యూటి తహసీల్దార్‌గా ఎస్ ప్రవీణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు.ఇంతవరకు పనిచేసిన రషీద్‌ఖాన్ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ కాగా ప్రవీణ్‌కుమార్ కలెక్టర్ కార్యాలయం నుంచి సదాశివనగర్ నాయబ్ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు.

ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా రోహిత్

కామారెడ్డిటౌన్, జూన్ 19:ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా రోహిత్ నియామకం అయ్యారు.ఈనెల 15,16,17 తేదిలలో వరంగల్‌లో జరిగిన ఏబీవీపీ అభ్యాస వర్గలో నూతన కామారెడ్డి జిల్లా కన్వీ నర్‌గా కుంటరోహిత్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాడి పరిష్కార మార్గం కోసం కృషిచేస్తానని తెలిపారు.

భవన నిర్మాణ పనులను నాణ్యతగా నిర్మించాలి

● మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి



కొచ్చేరి మైసమ్మ వద్ద వసతి గృహనిర్మాణ పనులను పరిశీలిస్తున్న దృశ్యం

నసురుల్లాబాద్, జూన్ 19 : భవన నిర్మాణ పనులను నాణ్యతగా నిర్మించాలని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామ శివారులో గల కొచ్చేరి మైసమ్మ ఆలయం వద్ద ఒక కోటి 60 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న కాటేజ్ భవనాలను, సీసీరోడ్డు పనులను బుధవారం మాజీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మండల నాయకులతో మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న భవన పనులను నాణ్యతగా నిర్మించాలని మండల భవన పనులను నాణ్యతగా నిర్మించాలని మండల నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విఠల్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మాజీద్, మాజీ సర్పంచ్ రాము, ప్రతాప్‌సింగ్, మోహన్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లో సామాజిక తనిఖీ ప్రజా వేదిక



సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్న దృశ్యం

నిజాంసాగర్, జూన్ 19: నిజాంసాగర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 14వ విడత సామాజిక తనిఖీలో భాగంగా ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక తనిఖీ ప్రిసైడింగ్ అధికారి, అడిషనల్ డీఆర్ డీవో వామన్ రావు హాజరయ్యారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనికి సంబంధించి తనిఖీ నిర్వహించారు. మొత్తం 2 కోట్ల నలభై లక్షల రూపాయల పనులకు సంబంధించి తనిఖీ బృందం వారు తేది 11-06-2024 నుంచి 18-06-2024 వరకు అన్ని గ్రామాలలో తనిఖీ చేసి గ్రామసభలు నిర్వహించి, వచ్చిన అంశాలు, మస్టర్లలో తేడాలను, పనుల నాణ్యతను, తదితర అంశాలను ప్రజావేదికలో చదివి వినిపించారు. సింగీతం గ్రామంలో రూ. 1430 రికవరీ జరిగిందన్నారు. మిగిలిన గ్రామాలలో మస్టర్లలో, ఎంపిలలో జరిగిన పొరపాట్లను సరిచేసుకోవాలని సంబంధిత ఎఫ్ఏ, టీఎలకు నోటీసులివ్వడం జరిగిందన్నారు.

నేటి నుంచి 27 వరకు అల్బాండజోల్ మాత్రల పంపిణీ

మద్నూర్,జూన్ 19: ఉమ్మడి మద్నూర్ మండలంలో నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ నేటి నుంచి 27 వరకు ఇంటింటికి పంపిణీ చేయడం జరుగుతుందని డోంగ్లీ వైద్యాధికారిణి శ్రీలేఖ తెలిపారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో 34 గ్రామ పంచాయతీ పరిధిలో ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు మధ్య గల వారు 17599 ఉన్నారని ఆమె వెల్లడించారు. 2015 ఫిబ్రవరిలో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం ప్రకటించి 19 లోపు పిల్లలకు ఏడాదిలో రెండుసార్లు నులి పురుగుల నివారణ మాత్రలను మింగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తూ పిల్లల్లో అనేక రకాల అనారోగ్యాలకు కారణమవుతున్న నులి పురుగుల వ్యాప్తిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తారని అన్నారు.

అక్రమమద్యం,కల్తీకల్లుపై చర్యలు కరువు



అక్రమమద్యం, కల్తికల్లుపై ఎక్సైజ్ అధికారిని ప్రశ్నిస్తున్న జడ్పీటీసీ

రాజంపేట, జూన్ 19: రాజంపేట మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం ఎంపీపీలింగాల స్వరూపకృష్ణమూర్తి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో ఉన్న పలు సమస్యలను ప్రజాప్రతినిధులు లెవనెత్తారు.గ్రామాలలో రోడ్ల పక్కన బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. కల్తికల్లు అమ్మకాలు జరపడంతో ప్రజల ఆరోగ్యం రోజురోజుకు క్షీణించిపోతుందని తెలిపారు. సంబంధిత ఎక్సైజ్ అధికారులు కల్తీకల్లు, బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలన్నారు.గ్రామాలలో గ్రామసభలు ఏర్పాటుచేయక ఆరునెలలుగడుస్తుందని మరికొన్ని చోట్ల గ్రామసభలు నిర్వహించిన రిజిస్టర్‌లు ఏర్పాటు చే యక పోవడంపైఎంపీఓ రఘురాంని నిలదీశారు.అనంతరం చివరి సమావేశం కావడంతో ఎంపీపీ జడ్పీటీసీ,ఎంపీటీసీలను అధికారుల సమక్షం లో సన్మానిం చారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సావిత్రి, తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీటీసీలు సాగర్,రాజు,సుమలత,బాలరాజ్‌గౌడ్,హాజీ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన పీఆర్టీయూ నాయకులు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

కామారెడ్డి టౌన్, జూన్ 19: కామారెడ్డి జిల్లా నూతన కలెక్టర్‌గా శ్రీ ఆశిష్ సంగ్వాన్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా బుధవారం పీఆర్టియు నాయకులు మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.పీఆర్టియు చేపడుతున్న రక్తదాన శిబిరాల వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుశాల్, తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్:రామారెడ్డి కాంగ్రెస్ పార్టీ జడ్పీ ఫ్లోర్‌లీడర్ నారెడ్డిమోహన్ రెడ్డి బుధవారం కలెక్టర్ ఆశీష్‌సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సంద ర్భంగా రామారెడ్డి మండలంలోని పలు అభివృద్ధి పనులు, సంక్షేమ పనుల అమలు తీరు,అధికారుల పనితీరుపై దృష్టిసారించి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాలని కోరారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - మహారాజ
శాంతి - ఓసీ
ప్రియా 70 - మనమే
ప్రియా 35 - హరోంహర

బాన్సువాడ

మహేశ్వరి - ఇంద్రాణి
వెంకటేశ్వర - హరోంహర

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	170	220	240

